# వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 240    శుక్రవారం | 29 మార్చి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5


## పచ్చి అవకాశవాది కడియం



కడియం ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

8 లో..



8 లో

## కడియం శ్రీహరిని కలిసిన కాంగ్రెస్ నేతలు

చేరికకు ముహూర్తం ఖరారు

రేపు దీపామున్షి సమక్షంలో హస్తం తీర్థం



## జాబ్స్ పేరుతో టోకరా

రూ.4.50 కోట్లు వసూలు

ఒకరి అరెస్టు, ఎనిమిది మంది పరార్

రూ.25 లక్షల నగలు, డాక్యుమెంట్లు స్వాధీనం

8 లో



2లో

## అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



# బలపడుతున్న కాంగ్రెస్

# భయపడుతున్న 'కేడర్'...



### చేరికలతో పాత క్యాడర్‌లో నిస్తేజం

జెండాలు మోసేది మేమైతే పదవులు అనుభవించేది వారా అంటూ ప్రశ్న

### కార్యకర్తలుగానే మిగిలిపోవాలా అంటూ నిలదీత

అధికారంలోకి వచ్చినా చిన్నచూపేనా అంటూ పెదవివిరుపు

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా భారీ ఎత్తున చేరికలు ఉండి బలపడుతున్నట్టు కనిపించినప్పటికీ పాత కేడర్‌లో మాత్రం ఆందోళన నెలకొంది. గత పది సంవత్సరాల నుంచి పార్టీని నమ్ముకుని కేసులకు, బెదిరింపులకు భయపడకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తమ పార్టీ అధికారంలోకి వచ్చిందనే సంతోషం కూడా లేకుండా పోయిందన్న భావన వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు ఎవరితోనైతే పోరాడేమో తిరిగి వారితోనే పార్టీ కార్యక్రమాలు పంచుకోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రజల తిరస్కారానికి గురైన నాయకులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరి ఎక్కడ తమపై మళ్లీ అధికారం చెలాయిస్తారోనన్న భావన పాత కేడర్‌లో నెలకొంది. స్థానిక సంస్థల్లో తమకు అవకాశం దక్కుతుందా లేదా అన్న ఆందోళన మొదలైంది. ఎప్పటికీ కార్యకర్తలుగానే మిగిలిపోవాలా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి ఆయువుపట్టులాంటి కేడర్ ఇదే భావనతో సైలెంట్ అయిపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

- వరంగల్ వాయిస్, నడికూడ

వివరాలు 2లో..

# బలపడుతున్న కాంగ్రెస్..
# భయపడుతున్న కేడర్..



**చేరికలతో పాత క్యాడర్‌లో నిస్తేజం**

**జెండాలు మోసేది మేమైతే పదవులు అనుభవించేది వారా అంటూ ప్రశ్న**

**కార్యకర్తలుగానే మిగిలిపోవాలా అంటూ నిలదీత**

**అధికారంలోకి వచ్చినా చిన్నచూపేనా అంటూ పెదవివిరుపు**

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా భారీ ఎత్తున చేరికలు ఉండి బలపడుతున్నట్టు కనిపించినప్పటికీ పాత కేడర్ లో మాత్రం ఆందోళన నెలకొంది. గత పది సంవత్సరాల నుంచి పార్టీని నమ్ముకుని కేసులకు, బెదిరింపులకు భయపడకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తమ పార్టీ అధికారంలోకి వచ్చిందనే సంతోషం కూడా లేకుండా పోయిందన్న భావన వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు ఎవరితోనైతే పోరాడేమో తిరిగి వారితోనే పార్టీ కార్యక్రమాలు పంచుకోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రజల తిరస్కారానికి గురైన నాయకులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరి ఎక్కడ తమపై మళ్ళీ అధికారం చెలాయిస్తారోనన్న భావన పాత కేడర్ లో నెలకొంది. స్థానిక సంస్థల్లో తమకు అవకాశం దక్కుతుందా లేదా అన్న ఆందోళన మొదలైంది. ఎప్పటికీ కార్యకర్తలుగానే మిగిలిపోవాలా అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీకి ఆయువుపట్టులాంటి కేడర్ ఇదే భావనతో సైలెంట్ అయిపోతే పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

-వరంగల్ వాయిస్, నడికూడ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైనప్పటికీ కార్యకర్తలు పార్టీకోసమే పనిచేశారు. నాయకులు ఒక్కరొక్కరు హస్తం వీడి కారు ఎక్కుతున్నా కేడర్ కాంగ్రెస్ జెండా వీడలేదు. అధికారంలోకి వచ్చిన బీఆర్ ఎస్ పార్టీ ప్రతిపక్షమే లేకుండా చేయాలన్న లక్ష్యంతో ఎన్ని నిర్భందాలు పెట్టినా మా అండా కాంగ్రెస్ జెండా అంటూ వెలుగెత్తి చాటారు తప్ప ఏనాడూ పార్టీకి ద్రోహం చేసే ప్రయత్నం చేయలేదు. రేవంత్ రెడ్డి టీపీసీసీ ప్రెసిడెంట్ అయిన తర్వాత మరింత ఉత్సాహంతో పనిచేసిన కార్యకర్తలు పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు శాయశక్తులు కృషి చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా ఆశించిన మేర ఆధిక్యం సాధించకపోవడంతో అధిష్ఠానం భారీ ఎత్తున చేరికలకు గేట్లు తెరిచింది. ఇదే పార్టీని నమ్ముకొని పనిచేసిన క్యాడర్ ను ఆందోళనకు గురి చేస్తోంది.

## రెడీమేడ్ నాయకులు..

నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తూ పార్టీని ప్రజల్లో సజీవంగా నిలుపుతున్న ద్వితీయశ్రేణి నాయకులకు చేరికలు గొడ్డలి పెట్టుగా పరిణమిస్తున్నాయి. ఎన్నికల్లో పోటాపోటీ తలపడి పరాజయం పాలైన వారంతా పదవులకోసం అధికార పార్టీలో చేరుతున్నారు. దీంతో అధిష్టానం సైతం రెడీమేడ్ నాయకులను ప్రోత్సహిస్తూ వారికే పదవులు కట్టబెట్టడంపై క్యాడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. మేము జీవిత కాలం కార్యకర్తలుగానే మిగిలిపోవాలా అంటూ నిలదీస్తున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకొని నాయకుడిగా చెలామని అవుతన్న వారికే పదవులు దక్కితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. 'ఇన్ స్టెంట్' గెలుపు కోసం 'రెడీమేడ్ 'నాయకుల వైపు అధిష్ఠానం చూడడాన్ని తప్పుపడుతున్నారు. ఇష్టం లేకపోయినా పార్టీపై, ప్రజలపై వారిని రుద్దడంపై మండిపడుతున్నారు.



వరంగల్ వాయిస్, ఫైల్ ఫొటో..

## జంపింగ్ రాజకీయాలు..

ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం, భరోసా కలిగించకుండా ఉచిత పథకాలే తమను గెలుపు తీరాలకు చేర్చుతాయన్న అభిప్రాయంతో ముందుకు సాగడంపై ద్వితీయ శ్రేణి క్యాడర్ తీవ్రంగా మండిపడుతున్నారు. ఉచితాలతో ప్రజలు తమవైపే ఉన్నారన్న భావన కలిగిస్తూ ఇష్టాతిరీతిగా వ్యవహరిస్తే ఫలితం అనుభవించక తప్పదంటున్నారు. క్యాడర్ లేకుండా పార్టీ మనుగడ కష్టమంటున్నారు. అనేక వ్యూహాలు అవలంబించి సంక్షేమ పథకాలను విరివిగా ప్రవేశ పెట్టిన పార్టీని ఇటీవల ప్రజలు తిరస్కరించిన విషయాన్ని మరువరాదంటున్నారు. సంఖ్యా బలం కోసం పార్టీలు చేసే పనులను, పార్టీలు ఎదుగుతున్న తీరును, అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్న సంగతిని రాజకీయ పార్టీలు గుర్తించాల్సిన అవసరం ఉంది. కేవలం జంపింగ్ జపాంగ్ లతోనే పార్టీ బలపడదంటున్నారు.

## బలమైన క్యాడర్..

పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లకుండా, ఎవరినైతే ప్రజలు తీరస్కరించారో తిరిగి వారినే పార్టీ లోకి చేర్చుకొని ప్రజల ముందు నిలబెడితే ప్రజలు దీనిని మార్పుగా భావించరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలనుంచి వచ్చిన నాయకుడిని విస్మరిస్తున్న పార్టీలు ఇన్ స్టంట్ నేతల వేటలో పడుతున్నారు. రాజకీయాలు కాస్లీగా మారడంతో అధిష్ఠానం సైతం రెడీమేడ్ నాయకులకు వల వేస్తున్నారు. అయితే స్థానిక నాయకత్వం, ప్రజల సహకారం లేకుండా ఏ పార్టీ మనుగడ సాధించలేరన్న విషయాన్ని మరువరాదంటున్నారు. అలా కాకుండా కేవలం వ్యూహాలను మాత్రమే నమ్ముకుంటే రాజకీయ పార్టీలకు కార్యకర్తలు, నాయకులు లేకుండా కేవలం ఓటర్లు మాత్రమే మిగులుతారని గుర్తించాలి. అన్ని వేళల్లో వూహాలు పనిచేయవన్న విషయాన్ని మరువరాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బలమైన క్యాడర్ ఉన్న పార్టీలే బతికి బట్టకడుతాయంటున్నారు.

# పుల్లూరు వేణుగోపాల్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్ టీఎన్జీఓఎస్ యూనియన్ హనుమకొండ అసోసియేట్ అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ సౌజన్యంతో శుక్రవారం రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాలులో పుల్లూరు వేణుగోపాల్ ను పుష్పగుచ్ఛం, శాలువా కప్పి జ్ఞాపికను అందచేసి ఘనంగా సన్మానించారు. పుల్లూరు వేణుగోపాల్ తన ఉద్యోగ బాధ్యతను నిర్వహిస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలకవర్గ సభ్యుడిగా ప్రజా సేవలో అంకితమైనందుకు అభినందించారు. ఈ ఆత్మీయ సన్మానానికి హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డాక్టర్ హెచ్.సంధ్యారాణి, బాశెట్టి హరిప్రసాద్, రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె. కిషన్ రావు, డా. టి.మదన్ మోహన్ రావు, టీఎన్జీఓఎస్ ప్రెసిడెంట్ ఆకుల రాజేందర్, సెక్రటరీ బైరి సోమయ్య, శ్యామ్ సుందర్, కత్తి రమేష్, రాజమౌళి, సురేష్, పావని, జయంతి, శ్రీలత, భగవాన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్, ప్రణయ్, అనూప్, పృథ్వీ, భరత్, అశోక్, రవీందర్, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన 3 గ్రామాల మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, ఏఎంసీ చైర్మన్లు, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు, వారితో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది రాజీనామా చేసి స్థానిక ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కొత్తగా పార్టీ చేరికలపై నాయకులు, కార్యకర్తలు, ఆందోళన చెందవద్దు, అందర్నీ కాపాడుకుంటాం, మీరంతా యశస్విని ఝాన్సీ రెడ్డి కుటుంబ సభ్యులని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి అన్నారు. ప్రత్యర్థులు కాంగ్రెస్ పార్టీ పట్ల అసత్య ప్రచారాలు చేస్తూ, గందరగోళం సృష్టిస్తున్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కొత్త, పాత అనే తేడాను మరిచి ప్రతి ఒక్కరూ గత ఎన్నికల్లో ఏ విధంగా నైతే కష్టపడి పనిచేశారో, అదే విధంగా ఎంపీ ఎన్నికల్లో కూడా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు, వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## అభిమాని సైకిల్ యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే..

పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలుగా నేను విజయం సాధిస్తే సైకిల్ యాత్రతో తిరుపతికి వస్తానని కాంగ్రెస్ వీరాభిమాని బైకాని ఐలేష్ మొక్కు చెల్లించడానికి సైకిల్ పై బయలుదేరడం అభినందనీయమని ఎమ్మెల్యే యశస్విని ఝాన్సి రెడ్డి గారు అన్నారు. శుక్రవారం మండలంలోని తీగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ వీరాభిమాని, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బైకాని ఐలేష్ చేపట్టిన తిరుపతికి సైకిల్ యాత్రను ఆ గ్రామ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు.

# ఉపాధి హామీ కనీస వేతనం పెంచాలి

## పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్



**వరంగల్ వాయిస్, మహబూబాద్ :** దేశవ్యాప్తంగా కుల, మతాలకు అతీతంగా నిరుపేద ప్రజల జీవనోపాధి లక్ష్యాలను పెంచుతూ వలసల నివారణ మార్గంగా 2005 నుంచిదిగ్విజయంగా అమలుచేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రోజు వారి కూలీ వేతనం 500 కు పెంచాలని జాతీయ మానవ హక్కుల న్యాయసేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహబూబాబాద్ జిల్లా పరిధిలో అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కానీ, ఉపాధి హామీ కూలీలకు చెల్లించే వేతనం రూ.272 నుండి రూ.300 లకు పెంచి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకొందని అన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని రోజువారీ వేతనం రూ.500 లకు పెంచాలని డిమాండ్ చేశారు.

# దర్గాలో అక్రమ వసూళ్లను అడ్డుకున్న గ్రామస్థులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ప్రముఖ యాత్రా స్థలమైన అన్నారం షరీఫ్ యాకూబ్ శావాలి బాబా దర్గాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఎంక్వైరీ చేసి సంబంధిత కాంట్రాక్టర్ పై వక్ఫ్ బోర్డ్ వారు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారంవారు దర్గాలో జరుగుతున్న అక్రమ వసూళ్లను అడ్డుకున్నారు. పవిత్రమైన అన్నారం షరీఫ్ దర్గాలో భక్తుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడ్డ కాంట్రాక్టర్ అగడాలపై ఎంక్వైరీ చేసి తక్షణమే కాంట్రాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ తో చేతులు కలిపిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొడుగు భిక్షపతి, సారంగం, రమేష్, గాడిపెల్లి రాజబాబు, అఖిల్, రాపోలు రవి, గొడుగు వినయ్, విజేందర్, విశాల్, హేమంత్, మణికంఠ, దిలీప్, గజ్జి మహేందర్, దయాకర్, విజయ్ ఇతర గ్రామస్తులు, యువజన సంఘాలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఫలేంద్రపు పోచయ్య ఆరోగ్యంతో చనిపోవడంతో ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి వారి కుటుంబాని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 2000 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషణ, జాడి గట్టయ్య, గడ్డం దుర్గయ్య, జోడు మల్లయ్య, గడ్డం స్వామి, రేగుల భాస్కర్, జోడు మహేష్, అట్టెం రాజేందర్, యూత్ ఇంచార్జి చింతకింది రాజు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

# కొండంత అండ మంత్రి కొండా సురేఖ

## అగ్ని ప్రమాద సహాయక చర్యల్లో మంత్రి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోచమ్మ మైదాన్‌లోని జకోటియా షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాద సహాయక చర్యలను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దగ్గరుండి పర్యవేక్షించారు. అగ్ని ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సూచనలు చేస్తూ, తానూ అక్కడే ఉన్నారు. అగ్ని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను అధికారులతో చర్చించారు. అక్కడి నుంచే సంబంధిత శాఖల అధికారులకు ఫోన్లు చేస్తూ, వారిని సమన్వయం చేస్తూ పరిస్థితిని సమీక్షించారు. అగ్ని ప్రమాదం జరిగిన షాపింగ్ కాంప్లెక్స్ కు చుట్టుపక్కల ఉన్న నివాసిత ప్రాంతాల్లో మంత్రి సురేఖ కలియ తిరిగారు. భయపడాల్సిన అవసరం లేదని, మంటలు వ్యాపించకుండా పూర్తి రక్షణ చర్యలు చేపట్టామని వారిలో ధైర్యాన్ని నింపారు. పరిస్థితి అదుపులోకి వచ్చేవరకు అటుగా ఎవరూ రావద్దని మంత్రి వారికి సూచించారు. స్వయంగా మంత్రి సురేఖ దగ్గరుండి పరిస్థితిని పర్యవేక్షిస్తుండటం పట్ల ప్రజలు ఊరట పొందారు. భీకరమైన అగ్ని ప్రమాద స్థలికి స్వయంగా వెళ్లి పరిస్థితులను స్వయంగా సమీక్షించిన కొండా సురేఖ తెగువ, ధైర్యం గొప్పదనీ, కాకతీయ వీరనారి రుద్రమదేవి ప్రతిరూపమే కొండా సురేఖ అని ప్రజలు ప్రశంసించారు. లండన్ పర్యటనలో ఉన్న కొండా సుస్మిత



పటేల్ వరంగల్ పోచమ్మ మైదాన్ అగ్ని ప్రమాద ఘటనను తెలుసుకొని తన తల్లి మంత్రి సురేఖకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీడియో కాల్ ద్వారా అగ్ని ప్రమాద స్థలిని పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో సంఘటనస్థలానికి కొండా అభిమానులు, కార్యకర్తలు తరలి వచ్చి అగ్నిమాపక సిబ్బంది, మున్సిపల్, పోలీస్ సిబ్బందికి తమవంతు సహాయ సహకారాలు అందించారు. సహాయక చర్యల్లో పాల్గొంటూనే, పనిలో నిమగ్నమైన ప్రభుత్వ సిబ్బందికి వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తూ వారు మరింత ఉత్సాహంతో సహాయక చర్యల్లో పాల్గొనేలా సహకరించారు. సంఘటన స్థలంలో ఎవ్వరికీ ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖలను సమన్వయం చేస్తూ సహాయక కార్యక్రమాలు చేపట్టారు.

## గ్రేట్ గోపి..

### మంత్రితో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోచమ్మ మైదాన్ లో గురువారం రాత్రి జరిగిన ఫైర్ ఆక్సిడెంట్ లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎస్బీఐ లైఫ్ ఎంప్లాయిస్ తో పాటు లోపట ఉన్న షాపు యజమానులను బయటికి తీసుకురావడంలో లోపలికి వెళ్లి అద్దాలను బ్రేక్ చేసి వారిని బయటికి తీసుకొచ్చిన మట్టెవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపిని అందరూ అభినందిస్తున్నారు. సమయస్ఫూర్తితో త్వరగా నిర్ణయం తీసుకొని వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసిన గోపితో పాటు మరో కానిస్టేబుల్ ను కూడా అభినందిస్తున్నారు. స్వయంగా మంత్రి కొండా సురేఖ రెండు గంటల పాటు అక్కడే ఉండి భారీ నష్టం జరగకుండా అధికారులతో సమన్వయం చేశారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇన్ స్పెక్టర్ గోపితో పాటు కానిస్టేబుల్, ఫైర్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# బీఆర్ఎస్ ఎంపీ సీటు మాదిగ సామాజికవర్గానికే ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం కేసీఆర్, కేటీఆర్ లు వరంగల్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా అత్యధికంగా ఓట్లు ఉన్న మాదిగ సామాజికవర్గానికే ఇవ్వాలని బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధానకార్యదర్శి, తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆర్షం మధుకర్ కోరారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన ఉద్యమకారులకు టికెట్ ఇస్తే గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

# ఆపదలో ఆదుకునే నేస్తం పూర్ణాచారి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి ఆపదలో ఉంటే ఆదుకునేందుకు ముందు ఉంటాడు. పరకాల పట్టణం 10వ వార్డు మాదారం కాలనీకి చెందిన సూదమల్ల స్వప్న, 20 వార్డుకు చెందిన బండారు కన్నయ్య ఇటీవల మృతిచెందిగా వారి కుటుంబాలకు పరకాల పట్టణ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి బియ్యంతో పాటు ఆర్థిక సాయం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నరు. ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకునే ఆపద్బాంధవుడు పూర్ణచారని పరకాల ప్రజలు అభినందించారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తల్లి గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిండ్ల యశస్విని రెడ్డి సంతోష్ స్వగృహానికి వెళ్లి వారి తల్లిని పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకోవడం జరిగింది. తదనంతరం సంతోష్ కుటుంబ సభ్యులతో, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే కార్యకర్తలకు పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా భావించి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే మూడు గ్యారెంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి గడపగడపకు ప్రచారం చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమరాజ శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 1న ఎమ్మార్పీఎస్ పరకాల నియోజకవర్గం సదస్సు

## పరకాల నియోజకవర్గం ఇంచార్జి మందరాజు మాదిగ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఏప్రిల్ 1న పరకాలలో జరగనున్న నియోజకవర్గం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని పరకాల నియోజకవర్గం ఇంచార్జి మందరాజు మాదిగ కోరారు. శుక్రవారం పరకాల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంద రాజు మాదిగ పరకాల నియోజకవర్గ ఇన్చార్జి పాల్గొని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులతో మాట్లాడుతూ జాతి భవిష్యత్తు ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై ఆధారపడి ఉందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరగాలంటే వర్గీకరణ లక్ష్యంగా 29 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తూ అనగారిన వర్గాల పక్షాన మాట్లాడుతున్న ఏకైక గొంతుక మందకృష్ణ మాదిగ ఒక్కరి వల్లే సాధ్యమన్నారు. ఏప్రిల్ 1న జరిగే పరకాల నియోజకవర్గం సభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాతాళ్ల రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దామెర రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొచ్చు ప్రశాంత్ మాదిగ, ఎమ్మెఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు బొట్ల యాకూబ్ మాదిగ, కోగిల రమేష్ మాదిగ, రాజేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, ములుగు :** కొత్తూరు గ్రామానికి చెందిన చిమ్మ రాజు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ములుగు జిల్లా సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ గ్రామానికి చేరుకొని రాజు మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. బాదం ప్రవీణ్ వెంట యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, వైస్ ప్రెసిడెంట్ కాసర్ల రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీందర్ రావు, తదితరులు ఉన్నారు.

## అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నుంచి, అధికారులు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రజాప్రతినిధులకు కొన్ని శాఖలు ముఖ్యంగా ఆరోగ్య శాఖ, మునిసిపల్ శాఖలో అవినీతిపై ఒక బాధితుడిగా ఫిర్యాదు చేశానప్పటికి ఎలాం స్పందన రాలేదని ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ రామక శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయంలో సీఎంగా రేవంత్ రెడ్డి స్పందించి, ఈ అక్రమాలను విచారించాలని, మీ ప్రభుత్వం ప్రతి శాఖలో అవినీతి జరగకుండా జాగ్రత్తతో ప్రజలకు న్యాయం చేకూర్చాలని డాక్టర్ రామక శ్రీనివాస్ శుక్రవారం కోరారు. అలాగే ప్రజల విన్నపాలకు సకాలంలో స్పందిస్తారని పూర్వ ప్రభుత్వం మాదిరి ఉండబోరని ఆకాంక్షించారు.

## ప్రైమ్ వన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, వరంగల్ జిల్లా టీయూడబ్ల్యూజే 143 అధ్యక్షుడు కక్కెర్ల అనిల్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా ప్రెస్ క్లబ్ ఆవరణలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, కమిటీ కార్యవర్గ సభ్యులు ప్రైమ్ వన్ సీనియర్ వీడియో జర్నలిస్ట్ ఖాదర్ పాష పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కూలీ పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలు ఫ్రాక్చర్ అయిన 40వ డివిజన్ తెలంగాణ మహిళా ప్రధాన కార్యదర్శి ఆవునూరి సునీతను, అలాగే బీఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు పోగుల రాజు ప్రమాదవశాత్తు కాలుకు గాయమైనందుకు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, వారి కష్టసుఖాలలో కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, బూత్ కన్వీనర్లు అంకం దేవానంద్, మరుపల్ల గౌతం, పోలేపాక రాజన్ బాబు, వంగరి సురేష్, శెట్టి మోహన్, సాదుల రంజిత్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కొలుపుల చంద్రకళ, ఉపాధ్యక్షులు ఎండీ వహీదా, చీర రమేష్, మంద నవీన్, ధర్మేందర్ లు ఉన్నారు.

## చెప్పకుండా వస్తారా..!

## కాంగ్రెస్ అభ్యర్థి బలరాంపై కార్యకర్తల ఫైర్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ లీడర్లం.. మీకు ఓట్లు వేయించే వాళ్లం.. మాకు తెలియకుండా..సమాచారం ఇవ్వకుండా.. మీ ఇష్టం వచ్చినట్లు వచ్చి... ఎవ్వరెవ్వరో ఇండ్లకు వెళ్తారా.. కనీసం వచ్చిన తరవాత కూడా చెప్పరా... వారినే ఓట్లు వేయమని చెప్పండంటూ మానుకోట కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ పై డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శుక్రవారం ఫైరయ్యారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా మండలంలోని గోలచర్ల, అమ్మపాలెం గ్రామాలతో పాటు పట్టణంలోని పలువురి ఇంటికి వెళ్లి మాట్లాడారు.. ఈ సందర్భంగా పలువురి గృహాల్లో తేనిటి విందులో పాల్గొన్నారు. అయితే కొందరు నాయకులు ఆయనను అడ్డు చెప్పారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా పట్టణానికి రావటం దేనికి సంకేతం అన్నారు. ఎవ్వరికి సమాచారం ఇవ్వకుండా వ్యవహరించే నాయకుడి వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని పలువురు చర్చించుకున్నారు. ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ వారికి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమనిగింది.

## తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీ వేజింగ్ బోర్డ్ సీనియర్ జర్నలిస్టు బందగి షోయబుల్లాఖాన్ ప్రాంగణంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ద్వితీయ మహాసభలో నూతన జర్నలిస్టు కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి మట్టూరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఈ మహాసభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి దక్కాల్సిన ప్రతిఫలాలను అదేవిధంగా పనిచేస్తామన్నారు. జిల్లా అక్రిడియేషన్ కార్డుల విషయంలో కూడా యూనియన్ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటుందని వారు అన్నారు. అంతేకాకుండా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని, దీనికిగాను అధ్యక్ష కార్యదర్శులుగా మట్టూరి నాగేశ్వరరావు, కొమ్మనబోయిన యాకయ్య, కోశాధికారిగా వై కిరణ్, ఉపాధ్యక్షులుగా పుల్లూరు ఉపేందర్, ఉడుగుల ఐలయ్య, కొంపెల్లి అమర్నాథ్, జి.కృష్ణవేణి, చాపల కృష్ణారెడ్డి, నిరంజన్, వేర్పుల మహేందర్ తో పాటు 12 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం, అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పరిశీలనలో డాక్టర్ నిరంజన్

### విద్యార్థులు, మేధావులు, ఉద్యోగస్తుల మద్దతు

### ప్రతి పక్షాలకు దీటైన అభ్యర్థి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ఎంపీ టికెట్ తన తండ్రి కడియం శ్రీహరి సహాయంతో బీఆర్ఎస్ టికెట్ పొంది పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో వరంగల్ స్థానంపై మళ్లీ చర్చ మొదలైంది. మొదటి నుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్న బీఆర్ఎస్ ఉద్యమ నాయకులకే వరంగల్ టికెట్ ఇవ్వాలని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తుంది. వరంగల్ జిల్లాలో ముఖ్యంగా అర్బన్ ప్రాంతమైన వరంగల్ లోక్ సభ పార్లమెంట్ స్థానాన్ని ఏ విధంగానైనా కైవసం చేసుకోవాలన్న ఉద్దేశంతో పార్టీ పట్ల నిబద్ధత కలిగి కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, అధ్యాపక ఉద్యమ నేపథ్యంతో పాటు ఒక మంచి మేధావిని వరంగల్ పార్లమెంటుకు బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఉస్మానియా కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది పేర్లతో పాటు ముఖ్యంగా డాక్టర్ బైరి నిరంజన్ పేరు బీఆర్ఎస్ పార్టీలో ప్రస్తావనకు వస్తున్నదని సమాచారం.

## కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలి

### జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ అనుచిత వాక్యాలు చేయడం పిరికి చర్య అని, ఇది సరైనది కాదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు సాయిలి ప్రభాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి తన స్వశక్తితో అంచెలంచెలుగా ఎదిగి, కష్టకాలంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలోకి వచ్చి కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల, ప్రజల ఆదరణ పొంది ముఖ్యమంత్రిగా, ఈ రాష్ట్రానికి ఒక శక్తిగా ఎదిగాడన్నర్నా. మీలాగా నీ బాపు బలంతో రాజకీయాల్లోకి రాలేదన్నారు. అలాంటి వ్యక్తి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, కేటీఆర్ తక్షణమే ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రంలో నీవు ఎక్కడ అడుగుపెట్టిన మా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఇబ్బందులకు గురికావలసిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

## ఘనంగా న్యూ తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యూ తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమకొండ లోని హరిత కాకతీయ హెూటల్ లో శుక్రవారం న్యూ తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అసోసియేషన్ డెవలప్ మెంట్ కు తనవంతు కృషి చేస్తానన్నారు. మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి న్యూ తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ స్టేట్ ఫౌండర్ కమిటీ బొబిలి లక్ష్మీ, చైర్మన్ బొబ్బిలి సైనిష్ కుమార్, కోశాధికారి మనుకుంట్ల మోహన్, ప్రధాన కార్యదర్శి నంగునూరు యాకయ్య, ఈసీ మెంబర్ పూసల శ్రీనివాస్, అడ్వైజర్ బూర శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, వరంగల్ జిల్లా అధ్యక్షులు పోతురాజు తిరుమల్ రావు, ప్రధాన కార్యదర్శి కలువల రాజమౌను మనోహర్, తెలంగాణ అన్ని జిల్లాల మ్యారేజ్ బ్యూరోలు పాల్గొన్నారు.

## రేగొండలో అరూరి వాహనం తనిఖీ



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశానికి వెళ్తుండగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రేగొండ వద్ద పోలీసులు బీజేపీ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు అరూరి రమేష్ పూర్తిగా సహకరించడం జరిగింది.

## హస్తం గూటికి వోగిలిశెట్టి అనిల్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 40వ డివిజన్ ఇంచార్జి వోగిలి శెట్టి అనిల్ కుమార్ శుక్రవారం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు దంపతులను కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ లోకి చేరిన అనిల్ కు శుభాకాంక్షలు తెలిపి పార్టీ కోసం అహర్నిశలు పనిచేయాలని కొండ దంపతులు కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుబేదారి క్యాంపు కార్యాలయంలో హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని మల్లారెడ్డి పల్లె, కొత్తపల్లి గ్రామాల మాజీ ఉప సర్పంచులు, గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను సుమారు 50 మందిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట నరసింహారెడ్డి, హసన్ పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్ల తిరుపతి, ఎంపీపీ కేతపాక సునీత, గ్రామ పార్టీ అధ్యక్షుడు సాంబయ్య, గాజు యుగేందర్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ గారి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్, సుందరయ్య నగర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నుంచి నాయకులు ఈర్ల రాజేందర్, పున్నం ఎల్లయ్య, డబ్బా రాములు, పిట్ట నగేష్, ఆర్మూర్ కుమార్, ఈర్ల రవి, సంజయ్, సారంగం, మహిళ నాయకురాలు నజుమా, రేవతి, కోమల యూత్ నాయకులు భారత్,పిట్ట సుధీర్, ప్రశాంత్, కిరణ్, వినయ్, సాయి తో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ సీనియర్ నాయకులు ఎస్కే జావేద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తా

## జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ద్వితీయ మహాసభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, బండి విజయ్, కోశాధికారి ఆర్ వెంకటేష్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ల సమక్షంలో మహబూబాబాద్ జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా జిల్లాలోని పలువురు వర్కింగ్ జర్నలిస్టుల సమక్షంలో కొమ్మనబోయిన యాకయ్యకు నియామక పత్రాన్ని అందజేసినట్లు యాకయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాలవల్ల 2021లో జరగాల్సిన మహాసభ లేటుగా జరగడం వల్ల జిల్లాలో సంఘం కాస్త వెనుకబడి ఉండడం మాట నిజమేనన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయడమే కాకుండా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని హామీ ఇచ్చారు. తనను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, రాష్ట్ర కేంద్రం నుంచి వచ్చిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోశాధికారి, కార్యదర్శి లకు, జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టులకు వృత్తిపరంగా ఎలాంటి సమస్య ఎదురైనా నాకు తెలియజేస్తే ముందుండి సమస్య పరిష్కారానికి తన శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

# ఏప్రిల్ 3న మరిపెడ ప్రెస్ క్లబ్ ఎన్నిక

## మరిపెడ అడ్‌హక్ కమిటీ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఏప్రిల్ 3న మరిపెడ మండల ప్రెస్ క్లబ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు మరిపెడ అడ్ హక్ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం మరిపెడ మండల కేంద్రంలోని జర్నలిస్ట్ కాలనీలో నిర్వహించిన సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో అర్హత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని జర్నలిస్టులు కమిటీ ఏర్పాటుకు కమిటీ బైలా రూపొందించారు. ఇందులో భాగంగా ఇప్పటికే అడ్ హక్ కమిటీ నియమించినట్లు తెలిపారు. కమిటీ బైలా ప్రకారం ఏప్రిల్ 1తేదీ వరకు సభ్యత్వాలు పూర్తి కావాలని ,సాయంత్రం ఓటర్ లిస్ట్ రిలీజ్ ఉంటుందని, ఏప్రిల్ 3న నామినేషన్ అనంతరం కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. కమిటీలో భాగస్వామ్యం కావాలనుకున్న ప్రతి జర్నలిస్టు ఏప్రిల్ 3న నిర్వహించనున్న మరిపెడ మండలం ప్రెస్ క్లబ్ ఏర్పాటు సమావేశానికి హాజరుకావలని అడ్ హక్ కమిటీ సూచించింది. ఈ సమావేశంలో మరిపెడ జర్నలిస్టు రియాజ్ పాషా, వీరాంజి, లచ్చయ్య, వేణు, రాజేష్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన అరూరి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** వరంగల్ పార్లమెంట్ విజయానికి సిద్ధమయేందుకు భూపాలపల్లి నియోజకవర్గంలో బూత్ అధ్యక్షులు, బూత్ కార్యకర్తలతో కలిసి సన్నాక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ వరంగల్ పార్లమెంట్ స్థానం గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బూతు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వరంగల్ అభ్యర్థిగా అధిష్టానం తన పేరును ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఈసారి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా కాషాయ జెండా ఎగరవేస్తామనే నమ్మకం మీ అందరిని చూస్తుంటే కలుగుతుందని ఉన్నారు. రేపటి మన తెలంగాణ భవితను మార్చబోతుంది ఈ గెలుపెనని చెప్పారు. ఈ వరంగల్ సీట్ ప్రధాని నరేంద్ర మోడీకి కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తకు ఉందన్నారు. రేపు మనం గెలవబోయే సీటు ప్రజల గెలుపుగా, భారతీయ జనతా పార్టీ కార్యకర్తల విజయంగా చరిత్రలో నిలుస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరిని కూడా ఈ విజయంలో మనం భాగం చేయాలన్నారు. ప్రతి బూత్ లోని లబ్ధిదారులను నేరుగా కలిసి వారికి ప్రధాన నరేంద్ర మోడీ అందించిన పథకాలను సహకారాన్ని గురించి వివరించాలని కోరారు. ఈ ఎంపీ సీట్ మనం గెలిస్తే భూపాలపల్లికి గ్రోత్ కారిడార్ గా చేసి వాణిజ్యపరంగా అభివృద్ధి చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాలో మహిళలు అధికంగా వెనుకబడి ఉన్నారు. వారికి స్వయం ఉపాధి కింద ఎంఎస్ఎంఈల కింద చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు సహకారాన్ని అందిస్తామని అన్నారు. అలాగే ఓపెన్ కాస్ట్ నిర్వాసితులకు ఇప్పటివరకు నష్టపరిహారాన్ని అందించలేదు, వారికి నష్టపరాన్ని అందించే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని చెప్పారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై భారతీయ జనతా పార్టీ విజయం కోసం కృషిచేయలన్నారు. ఈ రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేయడమే మన ముందున్న ఏకైక లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మోరే రవీందర్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు నిశీధర్ రెడ్డి , పార్లమెంట్ ప్రబారి మురళీధర్ గౌడ్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, మాజీ జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగపురి రాజమౌళి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపన్న, చదువు రామచంద్రారెడ్డి, కన్నం యుగదీశ్వర్, పార్లమెంటు కోకన్వీనర్ లింగంపల్లి ప్రసాదరావు, బీజేపీ నర్సంపేట ప్రభారి చందుపట్ల సత్యపాల్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టు రవి, భూపాలపల్లి జిల్లా నాయకులు, బూత్ స్థాయి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దందాలు చేసే సంస్కృతి ఝాన్సీ రెడ్డికి లేదు




**వరంగల్ వాయిస్, తొర్రూరు:** అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక, గ్రానైట్, ఇతర దందాలు చేసే సంస్కృతి ఝాన్సీ రెడ్డికి లేదని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ టీపీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డిలతో కలిసి కాకిరాల హరిప్రసాద్ మాట్లాడారు. సేవే పరమార్ధంగా రాజకీయాల్లోకి వచ్చిన ఝాన్సీ రెడ్డిపై పలువురు అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇసుక దందా, మైనింగ్ దందా, భూదందా లు చేస్తుందని ఝాన్సీ రెడ్డిపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆమె జీవిత చరిత్ర తెలిస్తే ఎవరూ ఆమెపై బురద చల్లబోరన్నారు. నిజాయితీగా పైసా పైసా సంపాదించుకున్నారని, ఆమెకు ప్రజల రక్తం పీల్చే కుసంస్కృతి లేదన్నారు. బీఆర్ఎస్ నేతలకు, ఇతర నాయకులకు అక్రమ ఆదాయంపై ఆలోచనలు ఉంటాయే కానీ, నిస్వార్థ నాయకురాలికి ఉండవన్నారు. ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశంతో ఎమ్మెల్యేగా పోటీ చేద్దామనుకున్న ఝాన్సీ రెడ్డికి పౌరసత్వ సమస్య రావడంతో వారసత్వాన్ని బరిలోకి దించి న్యాయాన్ని గెలిపించుకుందని గుర్తు చేశారు. ఎవరైనా ఆరోపణలు చేసినప్పుడు ఆధారాలు చూపించాలన్నారు. సూర్యుడిపై ఉమ్మేస్తే అది వారిపైనే పడుతుందని గుర్తెరగాలన్నారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి , ఝాన్సీ రెడ్డిలు నియోజకవర్గ అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని, వారి సంకల్పానికి ప్రజలు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, మెరుగు మల్లేశం గౌడ్, మచ్చ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, భిక్షం గౌడ్, బిజ్జాల అనిల్, నల్లపు వెంకన్న, నల్లపు రాజు, పెండ్లి మహేందర్ రెడ్డి, నల్లతీగ రవి, బిజ్జాల అనిల్, దేవేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## రేపు నీటి సరఫరా బంద్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నయీంనగర్ నాలా వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్నదున కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ బీఎల్ శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నయీం నగర్ నాలా వద్ద రోడ్డు విస్తరణ పనులకు అనునుగుణంగా పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు కొనసాగుతున్న క్రమంలో కేయూసీ ఫిల్టర్ బెడ్ పరిధిలోని ప్రాంతాలైన పబ్లిక్ గార్డెన్ ఏరియా గుడిబండల్ ప్రాంతం, కొత్తూరు, మచిలీబజార్, పద్మాక్షి కాలనీ, యాదవనగర్, విద్యారణ్యపురి, హసన్ పర్తి, భీమారం, చింతగట్టు, ముచ్చర్ల, పలివెల్పుల, వంగపహాడ్, గుండ్లసింగారం, పైడిపల్లి, గోపాలపురం, కేయూసీ జంక్షన్ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

## ఎర్రగట్టుగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

### హాజరైన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల పరిధిలోని ఎర్రగట్టుగుట్ట శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆలయానికి రావడంతో వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు ఎమ్మెల్యే నాగరాజు తీసుకున్నారు. అనంతరం వేదపండితులు స్వామివారి శేష వస్త్రాలు ఎమ్మెల్యేకు అందజేసి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే స్వామివారి కళ్యాణ మండపంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు, అర్చకులు, వర్ధన్నపేట నియోజకవర్గం అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట నరసింహారెడ్డి, హసన్ పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగేళ్లపల్లి తిరుపతి, మండల, 55వ, 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శివరామ్ ప్రసాద్, కనపర్తి కిరణ్, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## లోకల్ బస్సును క్రమం తప్పకుండా నడపండి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి గోపాలపురం హనుమకొండ జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశం రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య ఆధ్వర్యంలో విజయనగర కాలనీలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో 4-1- 2021 లోకల్ బస్సు 11జే సాధించుకొనుట జరిగిందని, తదనంతర పరిణామాలతో రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టు పనులతో 11జేకు అంతరాయం కలుగుట వలన జవహర్ కాలనీ గోపాలపురం ప్రాంతంలోని 78 కాలనీలకు ఆ ప్రాంత ప్రజలకు తీవ్రమైన అసౌకర్యము కలుగుతుందన్నారు. కాబట్టి, దానికి బదులుగా దేవన్నపేట నుంచి వరంగల్ కు ఉదయం, సాయంత్రం బస్సులను రెగ్యులర్ గా నడుపుట ద్వారా ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం తీరుందని తెలిపారు. కాబట్టి, వెంటనే 22 నెంబర్ బస్సు దేవన్నపేట నుంచి వరంగల్ వయా హనుమకొండ చౌరస్తా మీదుగా నడుపానలి కోరుతూ తీర్మానించడంతో పాటు ఈ తీర్మానాన్ని ఆర్టీసీ రీజనల్ మేనేజర్, డిపో మేనేజర్ లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యవర్గ సమావేశంలో నరసయ్య, ఉపాధ్యక్షులు కార్యదర్శి, చేరాల యుగంధర్, కోశాధికారి కొండపత్తిని రాజేందర్, గంటి సాంబయ్య, గంగారపు యాదగిరి, గోకారపు రాజేందర్, అనగాం జనార్ధన్, యాదగిరి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జనగామ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఎన్నికైన యెనగందుల చంద్రరుషి

### సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రంలో జనగామ బార్ కౌన్సిల్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన యెనగందుల చంద్రరుషిని వారి నివాసంలో శుక్రవారం పద్మశాలి సంఘం (జనగామ పోపా) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనగామ పోపా అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, సీనియర్ లాయర్ శ్రీరాం శ్రీనివాస్, పోపా వైస్ ప్రెసిడెంట్ దోర్నాల కుమార్, పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, పోపా సహాయ కార్యదర్శులు మదాసు ఎల్లయ్య, నల్ల ఆంజనేయులు, కందుల సురేందర్, మంతెన వీర నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సామల పరమేశ్వర్, మంగళంపల్లి లక్ష్మీనారాయణ, బింగి యాదగిరి, బత్తిని శ్రీనివాస్, బీమానాథ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలను కలిసిన పెరుమాండ్ల




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి దిపాదాస్ మున్షి, ఐఎన్ టీయూసీ నేషనల్ చైర్మన్ స్వామీనాథ్ జైస్వాల్ లను డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ కలిసి వరంగల్ ఎంపీ టికెట్ తనకు టికెట్ కేటాయించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించడంతో కృతజ్ఞతలు తెలియజేసినట్లు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణ మాట్లాడుతూ పార్టీకి సేవలందిస్తూ ఇటు ప్రజలకు సేవలు అందిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని సర్కారు కొలువుకు రాజీనామా చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలకు మధ్య అనునిత్యం ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం జరుగుతుందని, వరంగల్ పార్లమెంటు పరిధిలో తనకంటూ ఒక గుర్తింపు ఉందంటూ గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన వారిని ఎదుర్కొని ఎదురు నిలిచి నిలబడ్డానని చెప్పారు. ఒక ప్రశ్నించే గొంతుకై గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని వేలెత్తి చూపుతూ ముందుకు సాగానన్నారు. ఒక కార్యకర్తగా నన్ను గుర్తించి టికెట్ కేటాయిస్తే ఒక కార్యకర్తకు దక్కిన అవకాశమని వరంగల్ పార్లమెంట్ ప్రజలందరూ, కాంగ్రెస్ కార్యకర్తలు ఆనందపడతారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు వల్లాల జగన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్‌కు సన్మానం




### హుస్సేన్ నాయక్ ఈ స్థాయిలో ఉండటం సంతోషం

### బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** భారత ప్రభుత్వం చేత ఎస్టీ కమిషన్ మెంబర్ గా హుస్సేన్ నాయక్ నియమితులైనందుకు బంజారా జాతికి దేశంలో గౌరవం దక్కిందనీ మహబూబాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ సీతారాం నాయక్ అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ లోని నందనం గార్డెన్ లో బీజేపీ సీనియర్ నాయకుడు ఎడ్ల అశోక్ రెడ్డి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యుడు గరికపాటి మోహన్ రావు, మాజీ శాసన సభ్యుడు కొండేటి శ్రీధర్, బీజేపీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావులతో పాల్గొని హుస్సేన్ నాయక్ కు శాలువాతో సన్మానించారు. మారుమూల గ్రామం నుంచి ఉన్నత స్థాయికి హుస్సేన్ ఎదగడం చాలా సంతోషంగా ఉందన్నారు. మోదీ నాయకత్వంలో బంజారా కులస్థులకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. బంజారా వర్గానికి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులు, నియోజకవర్గ, మండలాల ముఖ్య నాయకులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్లామర్ డోస్ పెంచిన అనుపమ

## నేడు టిల్లు స్క్వేర్ విడుదల

అందరి చూపులు ఇప్పుడు అనుపమ పరమేశ్వరన్ పైనే వున్నాయి. ఆమె నటించిన 'టిల్లు స్క్వేర్' సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈమధ్యకాలంలో అనుపమకు పెద్ద బ్రేక్ అయితే ఏమీ రాలేదు, అలాగే పెద్ద సినిమాల ఆఫర్స్ కూడా లేవు. అనుపమ మంచి ప్రతిభ కల నటి, తెలుగులో తన గొంతుకు తనే డబ్బింగ్ చెప్పుకునే నటీమణుల్లో అనుపమ ముందుంటారు. ఈ 'టిల్లు స్క్వేర్' లో సిద్ధు జొన్నలగడ్డ పక్కన కథానాయికగా నటించింది. ఇంతకు ముందు సిద్ధు నటించిన 'డీజే టిల్లు' పెద్ద విజయం సాధించటం, ఆ సినిమాకి ఇది సీక్వెల్ గా రావటం, ఈ సినిమాకి లాభదాయకం అని అంటున్నారు.
ఇక ఇంతవరకు అన్ని సినిమాలలో అనుపమ తన నటనతో ఎక్కువమంది ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. సామాజిక మాధ్యమాల్లో కూడా ఆమెకి విశేషమైన పేరు వుంది, అందుకే ఆమెకి చాలా ఎక్కువమంది ఫాలోవర్స్ కూడా వున్నారు. ఇన్‌స్టాగ్రామ్ లో ఆమెకి 16 మిలియన్ ఫాలోవర్స్ వున్నారంటే మాటలు కాదు. అనుపమ గ్లామరస్ నటి కూడా, కానీ ఆమె ఎప్పుడూ పరిధి దాటకుండా ఇంతవరకు అన్ని సినిమాలలో కనిపించింది. మరి ఏమైందో ఏమో కానీ, 'టిల్లు స్క్వేర్' లో ఈ గ్లామర్ డోసు అనుపమ కావాలనే ఎక్కువ చేశారు అని అటు సామాజిక మాధ్యమాల్లో, ఇటు పరిశ్రమలో టాక్ నడుస్తోంది.
విడుదలైన ఈ సినిమా ప్రచార వీడియోల్లో చూస్తే అందులో అనుపమ ఇంతకు ముందు చేసిన సినిమాలతో పోలిస్తే ఈ సినిమాలో గ్లామర్ డోసు బాగా పెంచినట్టు కనపడుతోంది. అయితే ఆమె అభిమానులు చాలామంది ఆమెని అలా చూసి బాగా హర్ట్ అయ్యారు అని ఆమె సామాజిక మాధ్యమాల్లో వాళ్ళు పెట్టిన కామెంట్స్ చూస్తేనే అర్థం అయిపోతోంది.
ఆమె ఎందుకు ఈ సినిమా చేసినట్టు, కేవలం తనకి పెద్ద ప్రాజెక్టులు రావటం లేదని ఈ సినిమా ఒప్పుకున్నారు అనే టాక్ కూడా ఒకటి పరిశ్రమలో నడుస్తోంది.కొన్ని రోజుల క్రితం 'టిల్లు స్క్వేర్' ప్రచారానికి అనుపమ వచ్చినప్పుడు ఆమెకి విశేష స్పందన వచ్చింది. అలాగే ఎక్కువమంది ఆమె ఈ ప్రచార చిత్రాలలో కన్పించిన ఆ ముద్దు సన్నివేశం, గ్లామర్ డోసు పెంచారా లాంటి వీటిపై ప్రశ్నలు అడిగారు. అదే సమావేశంలో ఆమె 'టిల్లు స్క్వేర్' సినిమా ప్రచారాలు ఇక మిస్ అవును, అన్నిటికీ వస్తాను అని చెప్పారు.
కానీ ఆసక్తికరం ఏంటంటే నిన్న జరిగిన ఆ సినిమా ప్రీ విడుదల వేడుకకి ఆమె డుమ్మా కొట్టారు. మిస్ అయ్యారు.





# అమెజాన్‌లోకి
## మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా..!'

టాలీవుడ్ ప్రముఖ కమెడియన్ అభినవ్ గోమఠం గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. మళ్లీరావా చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి 'ఈ నగరానికి ఏమైంది', 'మీకు మాత్రమే చెప్తా', 'ఇచ్చట వాహనములు నిలపరాదు' సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇక ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. అయితే అభినవ్ గోమఠం తాజాగా నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా..!' ఈ సినిమాకు తిరుపతి రావు దర్శకత్వం వహించగా.. వైశాలి రాజ్, లావణ్య రెడ్డి కథనాయికలుగా నటించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదలై మంచి విజయం అందుకుంది. అయితే ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా మార్చి 29 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని మేకర్స్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. గోదావరి ప్రాంతంలో ఉన్న ఒక చిన్న పలెటూళ్లో మనోహర్ (అభినవ్ గోమఠం) అనే వ్యక్తి గొప్ప పెయింటర్ అవ్వాలని.. అలాగే తన ఊరిలోనే దానిపై మంచి బిజినెస్ పెట్టి లైఫ్ లో సెటిల్ అవుదామని కలలు గంటూ ఉంటాడు. ఈ క్రమంలో పరిచయమైన ఉమాదేవి తన కి ఎలా సహాయపడింది. మధ్యలో వీళ్ళ లవ్ ట్రాక్ ఏంటి? అసలు మనోహర్‌కు తాను కలలు గన్న జీవితం దొరుకుతుందా లేదా అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. కాసుల క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై వంశీ నందిపాటి సమర్పణలో ఆరేం రెడ్డి, ప్రశాంత్, భవాని కాసుల ఈ సినిమాను నిర్మించారు.

# భారీ హిట్టు కొట్టిన పృథ్వీరాజ్



మాలీవుడ్ స్టార్ హీరో మోహన్ లాల్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం మలైకోట్టై వాలిబన్ . లిజో జోష్ పెల్లిస్సెరీ డైరెక్ట్ చేసినీ ఈ మూవీ రిపబ్లిక్ డే కానుకగా జనవరి 25న గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటివరకు అత్యధిక ప్రీ సేల్స్ బిజినెస్ చేసిన సినిమాగా మలైకోట్టై వాలిబన్ రికార్డు నమోదు చేసింది. తాజాగా ఈ రికార్డును మరో మలయాళ స్టార్ హీరో బీట్ చేశాడు. ఇంతకీ ఆ హీరో ఎవరో కాదు.. పృథ్వీరాజ్ సుకుమారన్. ఈ స్టార్ హీరో నటించిన నేడు ప్రేక్షకుల ముందుకొచ్చింది. కేరళలో అత్యధిక ప్రీ సేల్స్ నమోదు చేసింది. మోహన్ లాల్ తర్వాత కేరళలో టాప్ ప్రీ సేల్స్ బిజినెస్ చేసి మరోసారి వార్తల్లో నిలిచాడు పృథ్వీరాజ్ సుకుమారన్. వాస్తవ సంఘటనల ఆధారంగా బెన్యమిన్ రాసిన నవల స్ఫూర్తితో తెరకెక్కింది. ఈ మూవీ ట్రైలర్ సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. పృథ్వీరాజ్ సుకుమారన్ తన పాత్రకు ప్రాణం పోశాడని ఇప్పటివరకు వచ్చిన రివ్యూస్ చెబుతున్నాయి. విజువల్ రొమాన్స్ ఇమేజ్ మేకర్స్, జెట్ మీడియా ప్రొడక్షన్, అట్ల గ్లోబల్ మీడియా సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాయి.

# గీతగోవిందం కాంబోలో ఫ్యామిలీ స్టార్

'ఫ్యామిలీ స్టార్' ట్రైలర్ రిలీజ్ వేడుకలో చిత్ర దర్శకుడు పరశురామ్, నిర్మాత దిల్‌రాజు సందడి చేశారు. నగరంలోని శ్రీరాములు థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ అభిమానులతో కలిసి ట్రైలర్ వీక్షించారు. అనంతరం చిత్రాన్ని ఉద్దేశించి దర్శకుడు పరశురామ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫ్యామిలీ స్టార్' విడుదలయ్యాక.. ఈ చిత్రాన్ని, ఇందులోని నటీనటులను తెలుగు ప్రేక్షకులు కొన్నేళ్లపాటు గుర్తుపెట్టుకుంటారని అన్నారు. అనంతరం దిల్ రాజు మాట్లాడుతూ.. గీత గోవిందం' కాంబోలో వస్తోన్న చిత్రమిది. ఆ స్థాయిలో వినోదం ఉండనుంది. కామెడీ, భావోద్వేగాలు అన్నీ కలిపిన పక్కా సమ్మర్ ఎంటర్‌టైనర్ ఇది. ఒక కుటుంబాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్లే ప్రతీ మనిషి ఫ్యామిలీ స్టారే. ఈ సినిమా చూశాక చాలామంది ఫ్యామిలీస్టార్స్‌లా మారతారు. నన్ను దిల్‌రాజుగా మార్చిన 'దిల్' సినిమా ఏప్రిల్ ఐదో తేదీనే విడుదలైంది. దాదాపు 21 ఏళ్ల తర్వాత అదే డేట్‌లో ఈ సినిమా రానుంది. యూనివర్సల్ కంటెంట్‌తో వస్తోన్న చిత్రమిది. తప్పకుండా అందరూ ఎంటర్‌టైన్ అవుతారని అన్నారు. తిరుపతిలో ట్రైలర్ రిలీజ్ సెలబ్రేషన్స్ చేయనున్నట్లు చెప్పారు.



# పచ్చి అవకాశవాది కడియం

## కడియం ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలి

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కుట్రలు, కుతంత్రాలు చేసి అధిష్టానానికి తప్పుడు సమాచారం అందిస్తూ, నీచమైన రాజకీయాలు చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని, కనీస నైతికత, వయస్సు పై గౌరవం ఉంటే ముందుగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తర్వాత ఏ పార్టీలోనైనా చేరాలని కడియం శ్రీహరికి మాజీ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నిత్యం నీతులు చెప్పే శ్రీహరి కనీసం ఈ సారైనా పాటించాలని సూచించారు. ఏ పార్టీలో ఉన్నా, స్వలాభం కోసం, నీ రాజకీయ ఎదుగుదల కోసం ఆ పార్టీలో తనకన్నా ముందున్న నాయకులను, కార్యకర్తలను అణచివేసి అహంకారపూరితంగా వ్యవహరించిన కుట్రలు అనేకం ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీలో పనిచేసినపుడు ఆ పార్టీ నేత చంద్రబాబును బ్లాక్ మెయిల్ చేసి అనేక పదవులు అనుభవించారని గుర్తుచేశారు. ఎదుగుతున్న దళిత నాయకులపై కుట్రలు చేసి, చాడీలు చెప్పిన నీచమైన చరిత్ర అంటూ విమర్శించారు. గత అహంకార పూరిత చర్యలు మరిచి తెలంగాణ కోసం నేనూ, కేటీఆర్, పెద్ది నిస్వార్థంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు. బీఆర్ఎస్‌లోకి రాగానే విజయరామారావు, రాగమల్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేష్ లు నీ కోసం, నీపదవుల కోసం బలైపోయారని వివరించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను రాజయ్యను కాదని నీకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారన్నారు. నీతి, నిజాయితీ అంటూ నీవు బ్లాక్ మెయిల్ చేసి నీ బిడ్డ కోసం వరంగల్ ఎంపీ టికెట్ సాధించావని వివరించారు. నీ మీద, కావ్య అభ్యర్థిత్వం పై అనేక మంది ఉద్యమకారులు, దళిత సంఘాలు వ్యతిరేకించినా వారిని ఒప్పించే ప్రయత్నం చేశారన్నారు. కానీ, రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీతో ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసుకుని నువ్వూ, నీ బిడ్డ ఓ లేఖను విడుదల చేయడం సిగ్గుచేటన్నారు.

### పదవులన్నీ అనుభవించిన కడియం : పెద్ది

పార్టీలోకి వచ్చిన కొద్ది కాలానికే ఎన్ని పదవులు ఉంటే అన్నింటిని అనుభవించిన చరిత్ర కడియం శ్రీహరిదంటూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. పార్టీ అన్ని పదవులు అనుభవించి అధికారం కోల్పోగానే ద్రోహం చేసే చరిత్ర కడియం శ్రీహరిదంటూ విమర్శించారు. ఇప్పటి నుంచి శ్రీహరి రాజకీయ విలువలు, నిజాయితీ అంటూ నీతులు చెప్పడం మానుకోవాలని సూచించారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకాలమంతా టీడీపీలో ఉండి తర్వాత టీఆర్ఎస్‌లో చేరినా నీకు ఎంపీ పదవి, ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, నీ కోసం వరంగల్ ఎంపీ ఉప ఎన్నికలు తెచ్చారని వివరించారు. తర్వాత ఖాళీగా ఉంటున్నావంటే మరోసారి ఎమ్మెల్సీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీగా ఉంటూ స్టేషన్ ఘన్ పూర్ లో రాజకీయం చేస్తే అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని నీకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారన్నారు. తాజాగా నీ బిడ్డకు ఎంపీ టికెట్ సైతం ఇచ్చారని చెప్పారు. ఇన్ని పదవులు అనుభవించేందుకు ఎందరో దళిత, ఉద్యమ నాయకులు త్యాగాలు చేశారనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

### దళిత ద్రోహి కడియం శ్రీహరి..

జడ్పీ చైర్ పర్సన్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కు షాక్ అని అంటున్నారు కానీ, అది కాంగ్రెస్ కే షాక్ అని అన్నారు. ఎందుకంటే ఏ ఎమ్మెల్యేను ఓర్వకుండా, దళితులను ఎదుగనీయకుండా చేశారని అన్నారు. కడియం శ్రీహరి దళిత ద్రోహి అని అన్నారు. ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కూడా ఏ ఒక్క దళితున్ని కూడా ఎదగకుండా చేస్తారని అన్నారు. కుట్రలు, కుతంత్రాలు చేసి దళిత నాయకులను బలహీన పరుస్తారని విమర్శించారు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టమే కాని, లాభం కాదని అభివర్ణించారు. ఈ మీడియా సమావేశంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, నన్నపునేని నరేందర్, మాజీ చైర్మన్ లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుదందర్ రాజు యాదవ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మైనారిటీ నేత నయీమొద్దీన్ అధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద కడియం దిష్టి బొమ్మ దహనం చేశారు.

# కడియం శ్రీహరిని కలిసిన కాంగ్రెస్ నేతలు

## చేరికకు ముహూర్తం ఖరారు

## రేపు దీపామున్షి సమక్షంలో హస్తం తీర్థం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షితో పాటు ఏఐసీసీ నాయకులను స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య శుక్రవారం కలిసారు..రేపు కాంగ్రెస్ లోకి స్టేషన్ ఘనపూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య చేరనున్నట్లు తెలిపారు. రేపు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకోనున్నట్లు మాజీ డిప్యూటీ సీఎం కడియం తెలిపారు.

# గారేపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**వరంగల్ వాయిస్, కాటారం :** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం గారేపల్లిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీస్ జవాన్లతో కవాతు నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. చౌరస్తాతో పాటు పురవీధుల గుండా పోలీసులు కవాతు చేశారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జున రావు, ఎస్సై మ్యాక అభినవ్, అదనపు ఎస్సైలు, సీఆర్పీ జవాన్లు పాల్గొన్నారు.

# శ్రీ దివ్య హాస్పిటల్ ప్రారంభోత్సవం

## హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి టౌన్ :** శ్రీ దివ్య హాస్పిటల్ భూపాలపల్లి పట్టణంలోని కాళేశ్వరం రోడ్డులో గణేష్ చౌక్ ప్రాంతంలో భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు ఈ రోజు నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ హాస్పిటల్ నిర్వాహకులు భూపాలపల్లి పట్టణానికి చెందిన యం.ఎస్ సర్జన్ అయిన డాక్టర్ దివ్య- రవితేజ దంపతుల ఆహ్వానం మేరకు హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్ లో రోగుల కోసం ఏర్పాటు చేసిన పలు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించి, అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

# జాబ్స్ పేరుతో టోకరా

## రూ.4.50 కోట్లు వసూలు, తెలుగు రాష్ట్రాల్లో ముఠా చీటింగ్

## హనుమకొండలో ఒకరి అరెస్టు, రూ.25 లక్షల నగలు, డాక్యుమెంట్లు స్వాధీనం

## ఎనిమిది మంది పరార్... ఏసీపీ వెల్లడి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు రాష్ట్రాల్లో గ్రూపు- 1 జాబ్స్ ఇప్పిస్తామని అమాయక ప్రజలను మోసం చేస్తూ అధిక మొత్తంలో డబ్బు వసూలు చేసిన ముఠాలోని ఓ సభ్యుడిని హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో ఈ ముఠాలోని సభ్యులను గుర్తించటంతో పాటు ఎవరెవరి నుంచి ఎంత డబ్బును నిందితులు వసూలు చేశారు అనేది తెలుసుకున్నారు. అరెస్ట్ అయిన నిందితుడి ఇంట్లో రూ.25 లక్షల విలువ చేసే బంగారం నగలు, భూముల డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సుబేదారి పోలీస్ స్టేషన్ లో హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి మీడియా సమావేశంలో తెలుగు రాష్ట్రాల్లో మోసాలకు పాల్పడిన చీటింగ్ ముఠా దందాను వెల్లడించారు. వరంగల్ పిన్నవారి వీధికి చెందిన కొత్త వీరేశం ప్రస్తుతం సికింద్రాబాద్ లోని వెస్ట్ మారేడుపల్లిలో గల అశ్వినికాలనీలో ఉంటున్నాడు. ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేస్తున్న ఆయన తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తన ఒక్కడి వల్ల అనుకున్నది సాధ్యం కాదని తన కొడుకు గోపీనాథ్, మిత్రుడైన గూడూరు పవన్ కుమార్, పవన్ కుమార్ భార్య గూడూరు వెంకట పద్మజతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరికి తెలిసిన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో కొందరు రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులతో తమకు పరిచయం ఉన్నట్లు ప్రజలకు చెప్పుకున్నారు. ముఠాలోని సభ్యుల్లో ఒకరైన గూడూరు పవన్ కుమార్ మామ బొమ్మన రఘునందన్ రావు ప్రతిమ హాస్పిటల్ లో డాక్టర్ గా పనిచేస్తున్నాడు. పవన్ కుమార్ డాక్టర్ బోయినపల్లి రవీందర్ రావును వీరేశంకు పరిచయం చేశాడు. బోయినపల్లి రవీందర్రావుకు ప్రతిమ మెడికల్ కళాశాల యజమాని శ్రీనివాసరావుతో బంధుత్వం, సాన్నిహిత్యం ఉంది. శ్రీనివాసరావు గత ప్రభుత్వంలో పోలీస్ అధికారులకు అత్యంత సన్నిహితుడని, అతనితో ఏమైనా పనులు చేయించుకోవచ్చని రవీందర్ రావును పరిచయం చేశాడు.

### రూ.4.50 కోట్ల వసూళ్లు..

ప్రభుత్వ శాఖల్లో మాకు తెలిసిన ఉన్నతాధికారులు ఉన్నారని ముఠా సభ్యులు ప్రచారం చేసుకున్నారు. దీంతో ఎవరినైనా నమ్మించి మోసం చేసి డబ్బులను సంపాదించవచ్చని అనుకున్నారు. చాలా డబ్బు ఉన్న వారిని పరిచయం చేసుకొని మోసం చేయాలనే ఉద్దేశంతో వాళ్లకు ప్రభుత్వ శాఖల్లో ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించారు. పవన్ కుమార్ కు బంధువైన ఉటుకూరు శ్రీనివాసరావు అడ్వకేట్ లీగల్ గా తమకు సహకరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ పార్టీలతో మంచి సంబంధాలు కలిగిన బుచ్చిబాబు ఏ బుచ్చయ్య ఉద్యోగాలు ఇప్పించడంలో సహకరిస్తున్నారని తెలిపారు. ఇలా కొందరి వద్ద రూ .4.50 కోట్ల డబ్బు వసూలు చేశారు. ఇవాళ హనుమకొండ ఆదాలత్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన కొత్త వీరేశంను అదుపులోకి తీసుకున్న సుబేదారి పోలీసులు విచారణ జరపగా ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితుడు వీరేశం ఇంట్లో పోలీసులు రూ.25 లక్షల నగలు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా పోలీస్ శాఖలో అదనపు ఎస్పీగా పని చేసి చనిపోయిన భాస్కరరావు భార్య శ్రీదేవి నుంచి కొడుకుకు ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ -1 ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.2.50 కోట్ల డబ్బు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఇలా పలువురు వద్ద రూ. కోట్ల డబ్బు వసూలు చేసిన ముఠాలోని వీరేశంను అరెస్టు చేయగా ఎనిమిది మంది పరార్ లో ఉన్నట్లు ఏసీపీ దేవేందర్ రెడ్డి చెప్పారు. ఈ ఎనిమిది మందిలో పవన్ కుమార్, పద్మజ, కొత్త గోపీనాథ్, ఉట్కూరు శ్రీనివాసరావు, బుచ్చిబాబు, బోయినపల్లి రవీందర్రావు, కొత్త అరుంధతి, కొత్త పూజిత ఉన్నట్లు ఆయన ప్రకటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com